క్లుప్తంగా

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ


సుంకన్న

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుంకన్న మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ప్రిన్సిపాల్ రఘురామాచర్యులను నందికొట్కూరుకు బదిలీ చేసిన అధికారులు ఆయన కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్నను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుంకన్న మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించేందుకు అధ్యాపకులతో కలసి కృషి చేస్తానన్నారు.

చలువ పందిళ్ల తొలగింపు


చలువ పందిళ్లు తొలగిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరంలో ప్రాచీన లలితా సంగమేశ్వరాలయంలోని చలువపందిళ్లను మంగళవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో తొలగించారు. వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులు సేదతీరేందుకు చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతుండడంతో కృష్ణాజలాలు సంగమేశ్వర ఆలయాన్ని సమీపిస్తున్నాయి. దీంతో చలువ పందిళ్లను తొలగించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీలో ఆడుతున్న క్రీడాకారులు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో మంగళవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలో కాశీ ముక్కంటి ఈశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను అనఘా సూపర్‌మార్కెట్ యజమాని నరేష్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 23 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్, శివ తెలిపారు.

విద్యార్థిని ప్రతిభ


అవార్డును అందుకున్న పి.గాయత్రి

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.గాయత్రి పదో తరగతిలో అధిక మార్కులు సాధించి షైనింగ్‌స్టార్ అవార్డ్‌కు ఎంపికైంది. ఇటీవల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి చేతులమీదుగా అవార్డుతోపాటు, నగదు పురస్కారాన్ని విద్యార్థిని అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న మంగళవారం తెలిపారు.

కుమారస్వామికి పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

యువకుడి అదృశ్యం


సర్దార్ (ఫైల్)

మహానంది: మసీదుపురం గ్రామానికి చెందిన దూదేకుల సర్దార్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండున్నరేళ్ల క్రితం ఉద్యోగ నిమిత్తం బెంగళూరు వెళ్లాడని, అప్పటి నుంచి తిరిగి రాలేదని తండ్రి పక్కీర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

రేషన్ బియ్యం ఆటో స్వాధీనం

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామం నుంచి నందికొట్కూరుకు మంగళవారం రాత్రి ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డ్రైవర్ అక్రమ్ తరలిస్తుండగా పోలీసులు ఆటోను తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో నందికొట్కూరుకు చెందిన మగ్బుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

- ఆగని ఇంజిన్ బోటు ప్రయాణం
- కార్యాచరణకు నోచుకోని నిషేధం హెచ్చరిక బోర్డులు

ఆర్డీఓ ఆదేశాలు బేఖాతర్

ఆర్డీఓ ఆదేశాలను అధికారులు గాలికొదిలారు. ఇదే అదునుగా భావించిన ఇంజిన్ బోటు నిర్వాహకులు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కనీస భద్రత చర్యలు తీసుకోకుండానే ఇంజిన్ బోటులో కృష్ణానదిని దాటిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులను ప్రశ్నిస్తున్నారు. – పగిడ్యాల


కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించి నదిని దాటిస్తున్న దృశ్యం


తెలంగాణలోని కొల్లాపూర్ వెళ్లేందుకు ఇంజిన్ బోటు ఎక్కుతున్న ప్రయాణికులు

పగిడ్యాల మండలంలోని మూర్వకొండ, అర్లపాడు ఘాట్ల వద్ద ఇంజిన్ బోటు నిర్వాహకులు ప్రయాణికుల ప్రాణాలతో వ్యాపారం సాగిస్తున్నారు. వారం రోజుల క్రితం ఆర్డీఓ నాగజ్యోతి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై కృష్ణానది పరివాహక గ్రామాల వెంట అనధికారిక ఇంజిన్ బోటు ప్రయాణాలను ఆపాలని ఆదేశించినా వారు పెడచెవిన పెట్టడంతో బోట్ల నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇంజిన్ బోటు ప్రయాణాలకు ప్రభుత్వ అనుమతి లేనందున ఇదే విషయాన్ని సూచిస్తూ ఆయా ప్రదేశాలల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తహసీల్దార్, ఆర్‌ఐల సెల్ నంబర్లు ప్రదర్శించాలని ఆర్డీఓ చేసిన సూచనలు కూడా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో జరిగే ప్రతి సమాచారాన్ని ఉన్నతాధికారుల నోటీస్‌లో పెట్టాల్సిన గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌లు కూడా అధికారులను బురిడీ కొట్టిస్తూ సొంత పనులకే పరిమితమవుతున్నారు.

పోటెత్తుతున్న వరద..

కృష్ణానది ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం పోటెత్తుతోంది. అయినా మూర్వకొండ, అర్లపాడు ఘాట్ల నిర్వాహకులు ఇంజిన్ బోటు ప్రయాణాలను యథేచ్ఛగా నిర్వహిస్తూ అధికారుల ఆదేశాలను కృష్ణానదిలో తొక్కుతున్నారు. ముచ్చుమర్రి పోలీసులు ఘాట్ నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించి బైండోవర్ కేసులు నమోదు చేసిన సంగతి విధితమే. టీడీపీ నాయకుల కనుసన్నల్లో పనిచేసే రెవెన్యూ అధికారులు ఘాట్ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ, రాయలసీమ ప్రాంత ప్రజలు ఎక్కువ శాతం పెళ్లిళ్లు చేసుకోవడం బంధుత్వాలను పెంచుకుని బస్సు ప్రయాణం కాకుండా నదిలో ఇంజిన్ బోటు ప్రయాణం చేసి అర గంటలో నది దాటుతూ ఆటోలు, బైక్‌ల ద్వారా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. అయితే ఇంజిన్ బోటు నిర్వాహకులు ప్రయాణికులకు ఎలాంటి లైఫ్ జాకెట్లు, గాలి ట్యూబ్‌లను అందుబాటులో ఉంచడం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌లను సందర్శించి ఆర్డీఓ ఆదేశాలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శివరాముడును వివరణ కోరగా త్వరలోనే మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌లను సందర్శించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం అధికారిగా రాజు


అధికారికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ అగ్నిమాపక కేంద్రం అధికారిగా యు.రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన యు.రాజు స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా మొదటి పోస్టింగ్ పెనుగొండలో చేశారు. అనంతరం కుప్పం, ఆదోని, ధర్మవరం అగ్నిమాపక కేంద్రాల్లో విధులు నిర్వహించిన ఆయనను ఇటీవల ఉన్నతాధికారులు ఆత్మకూరుకు బదిలీ చేయడంతో బాధ్యలు స్వీకరించారు. రాజు మాట్లాడుతూ ఆత్మ కూరు అగ్నిమాపక కేంద్రం పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బంది, ప్రజల సహకారంతో చర్యలు తీసుకుంటానన్నారు.అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన అధికారికి కేంద్రం ఉద్యోగులు, సిబ్బంది శాలువా, పూలమాల వేసి స్వాగతం పలికారు.

నేడు అరటి పంటల నమోదు

మహానంది: తిమ్మాపురం పరిధిలో పడిపోయిన అరటి తోటల వివరాలు బుధవారం తమ సిబ్బంది నమోదు చేస్తారని ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అయ్యన్న నగర్ నుంచి తెలుగు గంగ కాలువ వెంట, మహానంది వైపు పడిపోయిన అరటి తోటలు రైతుల తమ సిబ్బందికి వివరాలు అందజేసి సహకరించాలన్నారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ


ఆలయ పురవీధుల్లో శ్రీశైల గిరి ప్రదక్షిణ


స్వామిఅమ్మవార్ల పల్లకీని శ్రీశైల గిరిప్రదక్షిణకు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్‌రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన అధికారులు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన


లక్షకుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి రాలేని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర చెందిన 18 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అర్చకులు ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవు


స్వాధీనం చేసుకున్న నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. నాటుసారా విక్రయిస్తున్న వడ్డేమాన్ గ్రామానికి చెందిన బోయ శివకుమారి, సరఫరా చేసిన కోళ్లబావాపురం గ్రామానికి చెందిన కావేటి రాంబాబులరె అరెస్ట్ చేసి వారి నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ జప్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శంకర్ నాయక్, పోలీసులు శివన్న, మధుప్రసాద్, శ్వేతారాణి, రెవెన్యూ అధికారి పవిత్ర ఉన్నారు.

సీసీఆర్ కార్డులు తీసుకోండి

పాములపాడు: భూములు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా సీసీఆర్ కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు కోసం వీఆర్వోలను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బండిఆత్మకూరు: మండలంలోని ఈర్నపాడు గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. రైతు విజయ్‌రెడ్డికి చెందిన గేదె సోమవారం మేత కోసం పొలం వైపు వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో రైతు గాలించగా మంగళవారం ఉదయం పొలంలో విద్యుత్ తీగ తగిలి మృతి చెందినట్లు గుర్తించాడు. రూ.లక్ష విలువ చేసే గేదె మృతిచెందినట్లు రైతు వాపోయాడు.

కార్మికులను బలిచేయొద్దు

నందికొట్కూరు: యాజమాన్యాల మెప్పు కోసం కార్మికులను బలి చేయొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరా రు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని ది నాలకు ఆమోదం తెలపడం సరికాదన్నారు. నిర్బంధపు ఓవర్ డ్యూటీ చేయించడం మానుకోవాలని కోరారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై వచ్చేనెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల బదిలీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్ ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఐఎన్‌వీ మోహన్‌ను శ్రీకాళహస్తి దేవస్థానానికి, బీవీ శివారెడ్డి(అసిస్టెంట్ ఇంజనీర్), కె.గిరిజామణి (పర్యవేక్షకులు), డి.సదాశివరావు(సీనియర్ అసిస్టెంట్), ఎస్.అనురాధ(సీనియర్ అసిస్టెంట్), వీవీఎస్ గణపతి(జూనియర్ అసిస్టెంట్), వి.లక్ష్మీనారాయణ(జూనియర్ అసిస్టెంట్)లను మహానంది దేవస్థానానికి, ఎం.పోలేశ్వర రావు (జూనియర్ అసిస్టెంట్) ఆర్‌ఎస్.రంగాపురం సమీపంలోని మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానానికి, హెచ్.మంజునాథ్(జూనియర్ అసిస్టెంట్) కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి, టీ.ఏడుకొండలు (జూనియర్ అసిస్టెంట్) శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఇతర దేవస్థానాల నుంచి ఇద్దరు ఏఈఓ, ఇద్దరు పర్యవేక్షకులు శ్రీశైల దేవస్థానానికి బదిలీ అయినట్లు సమాచారం.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు


స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. మంగళవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

నందవరం ఏసీగా శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని నందవరం చౌడేశ్వరి దేవస్థానం రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరు భావనారాయణస్వామి ఆలయంలో రెగ్యులర్ ఏసీగా చేస్తున్న ఆయన మహానంది ఈఓ(ఎఫ్‌ఏసీ)గా ఉన్న విషయం తెలిసిందే. నందవరం రెగ్యులర్ ఏసీతో పాటు మహానంది ఈఓగా కొనసాగనున్నారు.

– కసాపురం దేవస్థానంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటనారాయణ మహానంది ఆలయానికి బదిలీ అయ్యారు.

16న జాబ్‌మేళా

ఆత్మకూరు: ఈనెల 16న ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలలో 10 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7673902328, 9154830286 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఇరువురి యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కాలనీలో నివాసం ఉంటున్న వినయ్ అనే యువకుడికి సంజామలకు చెందిన కృష్ణకాంత్ అనే మరో యువకుడికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వినయ్‌ని కృష్ణకాంత్ బీరుసీసాతో పొడిచి పరారయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

జనని బ్యాంకు కేసులో మరొకరి అరెస్ట్

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన జననీ బ్యాంకు కేసులో మంగళవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్లకు చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి నాలుగేళ్ల క్రితం పట్టణంలోని ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకులకంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని నమ్మబలికించారు. వీరి మాటలు నమ్మి కోవెలకుంట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఖాతాదారులుగా చేరి లక్షలాది రూపాయాలు డిపాజిట్లు చేశారు. ఈ సొమ్మును సంస్థ సీఈఓ వెంకటరమణ తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుని స్వాహా చేశాడు. ఫిక్సుడ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడవు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థయాజమన్యం బోర్డు తిప్పేయడంతో బాధితులు ఈ నెల 4వ తేదీ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. ఐదుగురు ఖాతాదారులకు చెందిన రూ. 13.45 లక్షలు స్వాహా చేసినట్లు కేసు నమోదు చేశారు. నిందితులైన గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్‌ను ఇటీవల అరెస్ట్ చేయగా కేసులో నిందితురాలిగా ఉన్న బ్యాంకు అధ్యక్షురాలు సుజాతను అరెస్ట్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆస్పత్రి ప్రాంగణంలో వ్యక్తి ఆత్మహత్య


వెంకటరమణ మృతదేహం

బనగానపల్లె రూరల్: కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె గ్రామానికి చెందిన జి.వెంకటరమణ(38) కడపు నొప్పి తాళలేక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కొన్నేళ్ల నుంచి కడపు నొప్పితో బాధపడుతున్నాడు. ఉదయం కడపు నొప్పితో పాటు భార్య అనురాధకు థైరాయిడ్‌కి చూపించుకునేందుకు బంధువులతో కలిసి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. అయితే భార్య వైద్యులని దగ్గరకు వెళ్లింది. కడపు నొప్పి బాధ తాళలేక వెంకటరమణ ఆస్పత్రి ప్రాంగణంలోనే పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మృతుడికి ఇద్దరు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


మిడుతూరులో బాలికలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ


బండిఆత్మకూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

నందికొట్కూరు: పదో తరగతి పూర్తయిన వెంటనే బాలికలకు పెళ్లిళ్లు చేసి, బాధ్యత తీరిందని అనుకోవద్దని బాగా చదివించి ప్రయోజకులను చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి ప్రత్యేక ప్రచారం నిర్వహించారు. సాంస్కృతిక, యోగా కార్యక్రమాల్లో పాల్గొన్న కౌమారదశ బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నయస్సులో బాలికలకు వివాహం చేయడంతో గర్భం దాల్చినప్పుడు, కాన్పు సమయంలో అనారోగ్యాలకు గురై ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఓ దరగయ్య, హెడ్ కానిస్టేబుల్ సుబ్బయ్య, ఏపీఎం సుబ్బయ్య, వైద్యులు తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి రేణుక పాల్గొన్నారు.

– బండిఆత్మకూరు: కిశోరి వికాసం వేసవి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మంగళవారం ముగిశాయి. తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌమార దశలో ఉన్న బాలికల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎం మాధవి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి సెలవుల మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాలికలను ఉన్నత చదువులు చదివించి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాఘవేంద్ర, టీచర్ శారద, ఎంఎస్‌కె.రోజా బిందు, పంచాయితీ కార్యదర్శి హజతున్నిస పాల్గొన్నారు.

– పాములపాడు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని సీహెచ్‌ఓ సునీత సూచించారు. మంగళవారం యర్రగూడూరు గ్రామంలో కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కిశోరి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ముర్తుజాబీ తదితరులు పాల్గొన్నారు.

– జూపాడుబంగ్లా: వ్యక్తిగత పరిశుభ్రతపై కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గోపికృష్ణ, హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, ఏపీఎం అంబమ్మ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోరబాలికలు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు.